# 3

# దేవుడు ఒక జనాంగమును విడిపించుట

## (నిర్గమకాండము 3 మరియు 14)

ఎప్పటిలాగే "మరో రోజు" ప్రారంభమయిందని మనం భావిస్తాము సరిగ్గా అప్పుడే ఊహించని సంఘటన ఒకటి జరుగుతుంది. ఇదే నిర్గమకాండము 3వ అధ్యాయంలో మోషే జీవితములోను జరిగింది. మిద్యాను భూమిలో తన మామ యొక్క గొఱ్ఱెలను మోషే కాస్తున్నాడు. నలభైయ్యేళ్ళుగా అతనికి ఇదే పని. సరిగ్గా అప్పుడే ఊహించని సంఘటన ఒకటి జరిగిందని 1వ వచనంలో చూస్తున్నాము.

అబ్రాహాము సంతతిలో ఒకడుగా, హెబ్రీ కుటుంబములో మోషే జన్మించాడు. దేవుడు వాగ్దానం చేసినట్లుగానే అతని కుటుంబం ఒక గొప్ప దేశము అయ్యింది. కొన్ని కారణముల చేత వారు ఐగుప్తు రాజు అయిన ఫరోకు బానిసలుగా మారారు. దేవుని జోక్యం వలన మోషే ఫరో గృహములో పెంచబడ్డాడు (నిర్గమకాండము 2:1-10). ఒక హెబ్రీ బానిసకొరకు ఐగుప్తీయుని చంపి ఐగుప్తు దేశమును వదలివెళ్ళిపోయాడు (తన జనాంగమును విడిపించ డానికి అతడు చేసిన చిన్న ప్రయత్నమిది కానీ ఇది బెడిసికొట్టింది; అపొస్తలుల కార్యములు 7:25). మిద్యాను చేరుకుని పెళ్ళి చేసుకుని, నా పని గొఱ్ఱెలను కాయడము, దేవుని ప్రజలను కాదు అన్న నిర్ణయానికి వచ్చి స్థిరపడ్డాడు మోషే.

కానీ దేవుని ఆలోచన వేరేలా ఉంది. యధావిధిగా మోషే తన గొఱ్ఱెలను మేపుతుండగా, మండుచున్న పొదను అతడు చూశాడు. మండుతుందే గాని కాలిపోవడం లేదు. ఈ వింత ఏమిటో చూద్దామని అతడు దగ్గరగా రాగా, దేవుడతనితో మాట్లాడాడు. అతడు నిలుచున్నది పరిశుద్ధ స్థలం అని. "తనను తాను అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవునిగా దేవుడు ప్రత్యక్షపర్చుకున్నాడు" (3:6). మనం ఊహించినట్లుగానే ఈ సంఘటన మోషే యొక్క ఆ దినమునే గాక అతని జీవితం మొత్తమును, ఇంకా చెప్పాలంటే ఇశ్రాయేలు ప్రజల జీవితమును మార్చివేసింది.

దేవునికి ప్రణాళిక ఉన్నది అని మోషేకు చెప్పాడు: దేవుడు ఇశ్రాయేలును బానిసత్వమునుండి విడిపించి "విశాలమైన మంచి దేశము" (కనాను)నకు నడిపించాలన్నది ఆయన ప్రణాళిక అని మోషేకు దేవుడు చెప్పాడు. మోషే ఫరో యొద్దకు వెళ్ళి, "నా ప్రజలను పోనిమ్ము" అన్న దేవుని సందేశాన్ని విన్పించాడు. (చూడు 5:1; 8:1; 9:1.) ఈ పనిని ఒప్పుకోవడానికి మోషే సుముఖంగా లేదు గనుక అనేక సాకులను కూడా చెప్పాడు. ఆఖరికి "వెళ్ళు!" అని దేవుడు ఖచ్చితంగా ఆజ్ఞాపించాడు, విధిలేని స్థితిలో మోషే వెళ్ళాడు. దేవుడు ముందుగా చెప్పినట్లుగానే (4:21). ఫరో హృదయం మరింత కఠినమై మోషే మాటను లక్ష్యపెట్టలేదు. కానీ దేవుడు ఐగుప్తు మీద పది తెగుళ్ళను రప్పించిన తరువాత మనస్సు లేకుండానే వారిని రాజు పోనిచ్చాడు (నిర్గమకాండము 7-11). వారు వెళ్ళిన మరుక్షణమే ఫరో మరలా మనస్సు మార్చుకుని ఇశ్రాయేలును ఎఱ్ఱసముద్రము వరకు తరిమాడు.

సముద్రపు జలాలను విభాగించి ఆరిన నేలపైన తన ప్రజలు నడిచివెళ్ళేటట్లు అద్భుతం చేశాడు దేవుడు. ఫరో ఇశ్రాయేలీయులను తరుముతూ, సముద్రపు నడిమికి రాగానే నీరు వారిని ముంచెత్తివేయడంతో ఐగుప్తు సేనలు నాశనం చేయబడ్డాయి, ఇశ్రాయేలీయుల ఈ సంఘటనల సమాహారాన్ని "నిర్గమము" ("the exodos") అని పిలుస్తున్నారు. ఇది *exodos* అన్న గ్రీకు పదంనుండి వచ్చింది. దీనికి "బయటకు వెళ్ళుట" అని అర్థము. ఈ సంఘటనలు కూర్పు చేయబడిన పాత నిబంధలోని ఒక గ్రంథమునకు ఇదే పేరు (నిర్గమకాండము) పెట్ట బడింది.

ఇశ్రాయేలు చరిత్రలోనే ఈ నిర్గమము గొప్ప సంఘటన. ఈ సంఘటన ఇశ్రాయేలు ప్రజలకు ఒక దేశముగా గుర్తింపునిచ్చింది. ఈ గొప్ప కార్యం ద్వారా దేవుడు వారిని విడి పించి ఒక దేశముగా మలిచాడు. ఆ రోజునుండి మహిమాయుక్తమైన కార్యము ద్వారా నడిపించబడిన ప్రజలుగా తమ్మును తాము భావించుకున్నారు. పాత నిబంధనలోని ఈ విమోచనా కార్యము క్రీస్తు యేసు యొక్క మరణ పునరుత్థానముల ద్వారా జరిగిన విమోచనా కార్యమునకు సమానార్థముగానున్నది. ఈ సంఘటనల ద్వారా క్రైస్తవులు రక్షణపొంది, ఒక జనాంగముగా గుర్తింపు నొందుతున్నారు.

ఈ ప్రయాణం ప్రాముఖ్యమైనదని చెప్పుటకు గల మరో కారణమేమంటే, ఇశ్రాయేలు ప్రజలు దీని ద్వారా తమ దేవుని గుర్తించగలిగారు. 430 సంవత్సరముల తమ బానిసత్వములో ఇశ్రాయేలీయులకు దేవునితో పెద్దగా సంబంధం లేకుండా గడిపారు. వారున్న అన్య వాతావరణములో వారిని నడిపించుటకు దేవునినుండి వాక్కు ఏమిలేదు. ఆరాధించుకునేందుకు దేవాలయం లేదు. సూచనలు చేయడానికి యాజకులు లేరు. ఇశ్రాయేలీయులను విడి పించుటలో మోషే అయిష్టము చూపడానికి ఒక కారణం ఏమిటంటే, తాను ఎవరి చేత పంపబడ్డారో, ఆయన ఎవరో ఇశ్రాయేలీయులకు తెలియదు (నిర్గమకాండము 3:13). వారి అరణ్య యాత్రలో జరిగిన సంఘటన ద్వారా ఇశ్రాయేలీయులు వారి దేవుని గురించిన గుణ లక్షణములను తెలుసుకున్నారు:

> ఆ దినమున యెహోవా ఐగుప్తీయుల చేతిలోనుండి ఇశ్రాయేలీయులను రక్షించెను. ఇశ్రాయేలీయులు చచ్చిన ఐగుప్తీయులను సముద్రతీరమున చూచిరి. యెహోవా ఐగుప్తీయులకు చేసిన గొప్ప కార్యమును ఇశ్రాయేలీయులు చూచిరి గనుక ఆ ప్రజలు యెహోవాకు భయపడి యెహోవాయందును ఆయన సేవకుడైన మోషేయందును నమ్మకముంచిరి (నిర్గమకాండము 14:30, 31).

## మాట నిలువబెట్టుకునే దేవుడు

ఇశ్రాయేలు ప్రజల బానిసత్వము, విమోచన గురించి నిర్గమకాండము మొదటిగా పేర్కొనలేదు. నిజానికి దేవుడు అబ్రాహాముతో వాగ్దానం చేసినప్పుడు ఇటువంటి సంఘటనలు జరుగుతాయని ముందే చెప్పాడు:

> ఆయన – నీ సంతతివారు తమది కాని పరదేశమందు నివసించి ఆ దేశపువారికి దాసులుగానుందురు. వారు నాలుగువందల యేండ్లు వీరిని శ్రమ పెట్టుదురు; వీరు ఎవరికి దాసులవుదురో ఆ జనమునకు నేనే తీర్పు తీర్చుదును. తరువాత వారు మిక్కిలి ఆస్తితో బయలుదేరి వచ్చెదరు (ఆదికాండము 15:13, 14).

ఇశ్రాయేలీయులు బానిసలుగా మారతారన్న విషయాన్ని దేవుడు మర్చిపోనట్లే, వారి శత్రువులను శిక్షించి ఇశ్రాయేలీయులను బానిసత్వమునుండి విడిపిస్తానన్న వాగ్దానమును మర్చిపోలేదు.

> ఆలాగున అనేక దినములు జరిగినమీదట ఐగుప్తు రాజు చనిపోయెను. ఇశ్రాయేలీయులు తాము చేయుచున్న వెట్టి పనులనుబట్టి నిట్టూర్పులు విడుచుచు మొరపెట్టుచుండగా, తమ వెట్టి పనులనుబట్టి వారు పెట్టిన మొర దేవునియొద్దకు చేరెను. కాగా దేవుడు వారి మూలుగును విని, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో తాను చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికొనెను. దేవుడు ఇశ్రాయేలీయులను చూచెను; దేవుడు వారియందు లక్ష్యముంచెను (నిర్గమకాండము 2:23-25).

తన ప్రజలతో నిబంధన చేయడం, దానిని కొనసాగించడం దేవుని స్వభావములో భాగం. కాబట్టి, ఒక రచయిత దేవునిని, "కొనసాగించు దేవుడు"[1] అని పిలిచాడు. బహుశ ఇశ్రాయేలు దేవుని మరిచిపోయియుంటుంది గాని దేవుడు మాత్రం ఇశ్రాయేలును మర్చిపోలేదు. అబ్రాహాముతో చేసిన వాగ్దానమును నెరవేర్చుటకే ఆయన ఇష్టపడ్డాడు.

దేవుడు అన్య మనస్కంగానో లేదా అప్పటికప్పుడు అన్పించింది చేయడమో చేయడు గాని, ఇచ్చిన మాటను నిలువబెట్టుకుంటాడని మనం గుర్తించాలి. "యెహోవానైన నేను మార్పులేనివాడను గనుక యాకోబు సంతతివారైన మీరు లయముకాలేదు" అన్న **ప్రభుని** మాటలను మలాకీ 3:6లో చూస్తున్నాం, "పాత నిబంధన దేవుడు" మరియు "క్రొత్త నిబంధన దేవుడు" వేర్వేరు అని ఎవ్వరూ భావించకుండా ఈ వాక్యము పాత నిబంధన చివరిలో ఇయ్యబడింది. పరిశుద్ధ గ్రంథంలో దేవుడు అన్ని వేళలా ఏకరీతిగానున్నాడు. కాబట్టి పాత నిబంధనలో ఆయన గురించి మనం నేర్చుకున్న విషయాలు క్రొత్త నిబంధన అనబడిన క్రీస్తు నిబంధనలో ఉన్న మనకు ఎప్పటికీ అన్వయించదగ్గవే! అలాగే, "యేసు క్రీసు నిన్న, నేడు ఒక్కటే రీతిగానున్నాడు" (హెబ్రీయులకు 13:8) అని క్రొత్త నిబంధన కూడ తెలియజేస్తుంది. దీనర్థం ఏమిటంటే, ఎప్పుడో ఇచ్చిన వాగ్దానం ఇప్పటికీ చెల్లుతుందా లేదా అని మనం చింతించనక్కరలేదు. అలాగే ఆయన అస్థిరంగా ఉన్నారేమో, నేనాయన్ను సంతోషపర్చలేనేమోనన్న చింత అక్కరలేదు. దేవుడు ఎల్లప్పుడు తన మాటకు కట్టుబడి యుంటాడు.

"అలా, అయితే," "ఇశ్రాయేలీయుల విషయంలో స్పందించడానికి దేవునికి నాలుగు వందల సంవత్సరాల కాలం పట్టిందా? ఆయన అంతకంటే కొంచెం ముందుగా స్పందించియుండవచ్చుగా?" అని ఒకరు అడుగవచ్చు. ఆయన అలాగు చేయగలడు కానీ, అలా చేయుటకు ఆయన ఇష్టపడలేదు. ఆయన సమయమందు, ఆయన ఇష్టప్రకారం స్పందించడం ఆయన విశేషాధికృతకు సంబంధించినది. ఆయన చిత్తమును మనం విశ్వసించాలి. ఆయన కార్యము కొరకు మనం ఎదురు చూస్తున్నప్పుడు తన మాటను ఆయన నిలబెట్టుకుంటారని మనం ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకొనగలం. ఈ నాటి క్రైస్తవుల నిరీక్షణకు పూర్వకాలపు ఇశ్రాయేలు నిరీక్షణకు పెద్ద తేడా లేదు. మోషే నుండి దాదాపు వెయ్యి సంవత్సరముల తరువాత, విమోచకుడు అయిన క్రీస్తు వచ్చాడు. క్రీస్తు రెండవ రాకడ నిమిత్తం ఆయన శిష్యులు సుమారుగ రెండువేల సంవత్సరాలనుండి ఎదురు చూస్తునే ఉన్నారు. ఆయన సమయమందు ఆయన ఎందుకు కార్యమును జరిగించాడు, మనకు చెప్పలేదు. మనం కేవలం ఆయన్ను విశ్వసించాలి.

ఆయన వాగ్దానములు నెరవేర్చబడడానికి మనకు ఎంతో కాలం పడుతున్నట్లే మనం యెహోషువ 1:5 వాక్య భాగమును గుర్తుకు తెచ్చుకోవాలి. మోషే మరణం తరువాత, యెహోషువ ఇశ్రాయేలు ప్రజలను వాగ్దాన దేశమునకు నడిపించాడు. ఆ దేశమును జయించడమంటే ఎంతో పోరాటముతో కూడిన పని. ఒక పెద్ద జనాంగమును నడిపిస్తూ పోరాటం చేయడము ఒక చిన్న పని కాదు. అందులోనూ సాత్వికుడైన మోషే అడుగుజాడల్లో నడిచిన యౌవ్వనస్థుడు భయపడతాడని దేవునికి తెలుసు. అందుకే ఆయన ఈ వాగ్దానం చేశాడు, "నీవు బ్రదుకు దినములన్నిటను ఏ మనుష్యుడును నీ యెదుట నిలువలేక యుండును; నేను మోషేకు తోడైయుండినట్లు నీకును తోడైయుందును."

అబ్రాహాము సంతతి విషయమై దేవుడు చెప్పిన వాగ్దానం నెరవేరబోతుంది. అబ్రాహాము కుటుంబమును దేవుడు ఒక గొప్ప దేశముగా చేశాడు. వారిని ఐగుప్తు బానిసత్వమునుండి విడిపించాడు. తరువాత వారి పితరులకు వాగ్దానం చేసిన దేశమును స్వతంత్రించుకునేలా వారిని సమర్థులు చేశారు. దేవుడు తన మాటను ఎప్పుడు నిలబెట్టుకుంటాడు.

## ఇతర దేవతలకంటే గొప్ప దేవుడు

కొన్ని శతాబ్దాల తరువాత, దేవతలకు అర్పించిన ఆహారమును తినాలా వద్దా అనే విషయమై కొరింథీ సంఘములో చెలరేగిన గందరగోళమునకు తెరదించుతూ పౌలు క్రైస్తవులకు కొన్ని సూచనలను ఇస్తున్నాడు:

> కాబట్టి విగ్రహములకు బలిగా అర్పించినవాటిని తినుట విషయము – లోకమందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము. దేవతలనబడినవారును ప్రభువులనబడినవారును అనేకులున్నారు. ఆకాశమందైనను భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి ఆయననుండి సమస్తమును కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే; ఆయన యేసు క్రీస్తు; ఆయనద్వారా సమస్తమును కలిగెను; మనము ఆయనద్వారా కలిగినవారము (1 కొరింథీయులకు 8:4–6).

ఈ లోకములో ఒక్కడే సత్య దేవుడున్నాడు, పూజింపబడే వారెవరైనా "దేవుడు లేక దేవతలని" పిలువబడతారు. కావున "దేవుళ్ళు లేక దేవతల" మధ్య ఎల్లప్పుడూ పోటి జరుగుతుంటుంది. ఈ విధంగా ఎంతో మంది దేవుళ్ళున్నారు. ఐగుప్తీయులు దాదాపు నలభై, అంతకంటే ఎక్కువ మంది దేవుళ్ళను పూజించేవారని పురాతన ప్రతులు తెలియజేస్తున్నాయి. ఇశ్రాయేలీయుల విమోచనా నిర్గమము ద్వారా ఇశ్రాయేలు దేవుడు ఐగుప్తీయుల దేవుళ్ళకంటే ఎంతో గొప్ప వాడని నిరూపితమైంది.

దేవుని పనికి మోషే ఇంకను సాకులు చెప్తూ, ఈ ప్రశ్నను అడిగాడు – "చిత్తగించుము; నేను ఇశ్రాయేలీయులయొద్దకు వెళ్ళి వారిని చూచి – మీ పితరుల దేవుడు మీ యొద్దకు నన్ను పంపెనని వారితో చెప్పగా వారు – ఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెనని దేవుని నడిగెను" (నిర్గమకాండము 3:13). తాము ఆరాధించలసిన దేవునికి ఒక ప్రత్యేకమైన పేరు ఉండాలని దానిని ఇశ్రాయేలీయులు కోరుకుంటారని మోషే గ్రహించాడు. అంతేగాకుండా ఐగుప్తు దేవుళ్ళకందరికీ పేర్లున్నాయి. ఇశ్రాయేలీయులు తమ దేవుని పేరును తెలుసుకోవాలనుకుంటున్నారు. ఇందుకు దేవుడు యిలా సమాధానమిచ్చాడు:

> అందుకు దేవుడు – **నేను ఉన్నవాడను** అనువాడనైయున్నాని మోషేతో చెప్పెను. మరియు ఆయన – ఉండుననువాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను. మరియు దేవుడు మోషేతో యిట్లనెను – మీ పితరుల దేవుడైన యెహోవా, అనగా అబ్రాహాము దేవుడు ఇస్సాకు దేవుడు యాకోబు దేవుడునైన యెహోవా మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెను. నిరంతరము నా నామము ఇదే, తరతరములకు ఇది నా జ్ఞాపకార్థక నామము (నిర్గమకాండము 3:14, 15).

"నేను" ("IAM") అన్నది హెబ్రీ పదం యొక్క రమారమి తర్జుమా. దీనినే "నేను ఏమైయున్నానో ఆ వ్యక్తిని" అని లేదా "నేను ఏమైయుండబోతున్నానో వానినే" అని కూడ వ్యక్తపర్చవచ్చును. దీని హెబ్రీ పదం "YHWH"; దీనిని సహజంగా "చతుష్కోర్థము" అని అంటారు. అన్ని పురాతన హెబ్రీ పదములవలెనే ఇది నిజానికి ఎటువంటి అచ్చులు లేకుండా వాడబడింది. అంటే దీన్ని ఏవిధంగా పలకాలో చెప్పడం కష్టము. దీనిని "యాహ్వే" ("Yahweh")గా పలుకవచ్చును ("Jahveh" అని కూడా వ్రాస్తారు కాని అలాగే పలుకుతారు).[2]

"YHWH" అంటే ఏమిటి? ఒక క్రియా రూప పదమును దేవుడు ఎందుకు తన పేరుగా పెట్టుకున్నాడు? దీనికి ఎన్నో సమాధానములున్నా, దీనికి చెప్పగల అర్థం ఏమిటంటే, "సత్యవంతుడైన దేవుడు, ఎల్లకాలము ఉండువాడు." దేవుడు యథార్థుడు, తనకు తానే ఉనికి కలిగినవాడు అని, సత్యస్వరూపుడు అని ఇది స్పష్టముగా చూపిస్తుంది. విగ్రహాలు జీవం లేనివి వాటిని పూజించేవారు వాటిని తయారుచేస్తారు, ఇక్కడికి, అక్కడికి వారేకమవుతారు. వాటి తరపున వారే మాట్లాడుతారు, వాటి సంరక్షణ వారే చూసుకుంటారు (యెషయా 44:9–20లో విగ్రహారాధన అనే బుద్ధిహీనత గురించి యెషయా విమర్శను చదవండి). ఇశ్రాయేలు యొక్క దేవుడు సజీవమైన సత్య దేవుడు. ఆయన చేసిన సృష్టి తమ ఉనికి, మనుగడ, రక్షణ కోసం ఆయనపై ఆధారపడుతుంది. నామ విషయములోను చెప్పుకోదగ్గ దేవునిగా ఆయన తన పేరుని ప్రకటించుకున్నాడు.

ఫరో కఠిన హృదయము వలన ఐగుప్తు మీదికి రప్పింపబడిన పది తెగుళ్ళు, ఐగుప్తు దేవతల మీద దేవుని ఆధిపత్యాన్ని సూచిస్తున్నాయి. ఏదికాక వారి నైలునది పొంగి తీర ప్రాంతములలో ప్రవహిస్తుంది. అందుచేత అది సారవంతమైన నేలను మంచి వ్యవసాయమును అందిస్తుంది. కాబట్టి నైలునదిని వారు ఒక దేవునిగా భావిస్తారు. నది తీరంలో మట్టిలో కప్పలు తిరుగుతుంటాయి కాబట్టి వాటిని దైవాంశ సంభూతమైనవిగా వారు భావిస్తారు. అలాగే కుళ్ళిన వాటిపై వాలే ఈగలను కూడ అలాగే భావిస్తారు. అలాగే ఫరో కూడ దేవుడేనని వారి భావన, ఈ తెగుళ్ళు ఐగుప్తును నాశనమునకు నడిపించాయి. కాబట్టి అవి "ప్రకృతిపరమైన సహజ వైపరీత్యాలు" కాదు. ఐగుప్తులోని అన్యదేవతల మీద దేవుని తీర్పు ఇది.

ఇశ్రాయేలు ప్రజలను పోనియ్యమని అడుగుటకు మోషే ఫరో యొద్దకు వెళ్ళినప్పుడు ఫరో నిర్లక్ష్యముగా, "నేను అతని మాట విని ఇశ్రాయేలీయులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను, ఇశ్రాయేలీయులను పోనీయననెను" (నిర్గమకాండము 5:2). అయితే తెగుళ్ళు ఐగుప్తును కొట్టినప్పుడు, ఫరో, ఐగుప్తు ప్రజలు నిజమైన దేవుడు ఎవరో, దేవతలకంటే పైనున్న దేవుడు ఎవరో, ఫరో కూడ మోకరిల్లి నమస్కరించాల్సిన దేవుడు ఎవరో తెలుసుకున్నారు. ఫరో జ్యేష్ఠ పుత్రుని మరణం దీన్ని స్పష్టంచేసింది.

"**ఉండుననువాడు** మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పుము"

(3:14) అని **ప్రభువు** మోషేతో చెప్పినప్పుడు, ఒక్క సత్య దేవునియందు నమ్మికయుంచాలని మరియు నిజముగా "దేవుళ్ళుకాని" వారు చెప్పువాటినన్నిటిని తిరస్కరించాలని పిలుపునిచ్చాడు (చూడు 2 దినవృత్తాంతములు 13:9; అపొస్తలుల కార్యములు 19:26; గలతీయులకు 4:8). ఈనాడు మనకు పోటిపడే అనేక "దేవతలున్నాయి" (సంపద, సుఖము, సాంకేతిక పరికరాలు, రాజకీయ శక్తివంటివి), కాబట్టి మనము కూడ దేవుళ్ళను లేక దేవతలను తిరస్కరించాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఇప్పటికీ తన ప్రజలను పాపమనే సమస్యనుండి విడిపించి, దానికి పరిష్కారాన్ని ఉంచిన దేవుడు ఒక్కడే ఉన్నాడు.

## పరిశుద్ధ దేవుడు

మండుచున్న పొద దగ్గరికి మోషే సమీపించినప్పుడు దేవుడు "దగ్గరకు రావద్దు, నీ పాదములనుండి నీ చెప్పులు విడువుము; నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము" అనెను (నిర్గమకాండము 3:5). దేవుని సన్నిధిని బట్టి, మోషే నిల్చున్న ప్రదేశం కూడా పరిశుద్ధమైనది అయింది. దేవుని "పరిశుద్ధత" గురించి మాట్లాడడమంటే దేవుని "ఇతరత్వము" గురించి చెప్పడమే. ఆయన కోసమే ప్రత్యేకత కలిగియున్నవాడు. ఆయన మనవంటివాడు కాదు. ఆయన పిలుపును బట్టిమాత్రమే మనమాయన్ను సమీపించాలి. ఆయన మార్గ దర్శకత్వములో నడుచుకోవాలి. సుదీర్ఘ బానిసత్వము, దేవునినుండి ఎడబాటు తర్వాత ఇశ్రాయేలు దేవుని గురించి తీవ్రంగా తీసుకోవడం నేర్చుకోవాల్సినది. ఆయన చెప్పిన విధంగానే వారు ఆయన్ను వెదకి ఆయన్ను సమీపించాల్సినది.

నిర్గమకాండములోని ఆఖరి పదిహేను అధ్యాయములు పరిశుద్ధత గురించి మాట్లాడుతున్నాయి. ప్రత్యక్ష గుడారము నిర్మాణము గురించి (ఆరాధన కొరకైన కట్టడము). అక్కడ అర్పింపబడబోవు బలులు, యాజకత్వము (యాజక వస్త్రధారణ) గురించి, ప్రత్యక్ష గుడారము యొక్క అలంకరణ గురించి ఈ అధ్యాయములలో దేవుడు మోషేకు సెలవిచ్చాడు. అలాగే దేవుని ఆరాధనకు సంబంధించిన వస్తువుల నిర్మాణం, ఏర్పాటునకు సంబంధించిన విషయాలు, ఎవరు నిబంధన మందసమును మోయవలెనన్న విషయం, ఎలా జరగాలి అన్న విషయాలు చెప్పబడ్డాయి. మనకు "అసంగతం" అనుకున్న విషయాలు కూడ దేవుని స్వభావాన్ని అర్థం చేసుకొనుటలో ఇశ్రాయేలు ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైనవి. దేవున్ని గౌరవపూర్వకముగా సమీపించాలన్న ప్రాముఖ్య విషయమును ఈ వివరాలు తెలియజేస్తున్నాయి.

అయితే ఆశ్చర్యకర రీతిగా, "మనము పాత నిబంధనకు లోబడి జీవించుటలేదు" అన్న భావన ఉండి క్రైస్తవులు కొన్నిసార్లు పరిశుద్ధత గురించి, గౌరవముతో దేవున్ని సమీపించుట గురించి పట్టనట్లు ఉంటారు. ఈ విధంగా చేయాలని లేఖనాలు ప్రత్యక్షంగా మనకు చెప్పడం లేదు కాబట్టి ఈ విషయం మనకు వింతగానే ఉంటుంది. క్రీస్తు యొక్క సిలువ దేవుని పరిశుద్ధతను మార్చలేదు. దేవుని పరిశుద్ధతను బట్టి సిలువ అవసరమయింది. ఎందుకంటే ఇది పాపమునకు ప్రాయశ్చిత్తం చేసింది. దీన్ని మనం విస్మరించలేము. ప్రాచీన ఇశ్రాయేలు వలె మనం అదే రకమైన ఆరాధనను అనుసరించుటలేదు. కానీ మన ఆరాధనా వైఖరి అలాగే ఉండాలి.

దేవుడు పరిశుద్ధుడు కాబట్టి, ఆయన్ను తిరస్కరించి మనం నాశనం కాకుండ ఉండలేం

అని ఈ యాత్రాకథనం తెలియజేస్తుంది. మోషే ఫరోను కలిసినప్పుడు ఫరో ఒక విరుద్ధ ప్రశ్నను అడిగాడు. "నేను అతని మాట విని ఇశ్రాయేలీయులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను, ఇశ్రాయేలీయులను పోనీయననెను" (నిర్గమకాండము 5:2). నిర్గమకాండము గ్రంథమునకు, వారి నిర్గమము యాత్రకు ఈ ప్రశ్నే ముఖ్యమైనది. దేవుడు ఎవరు? తన హృదయమును "కఠినపరుచుకొనుట" ద్వారా ఫరో దేవున్ని తిరస్కరించి కఠినుడయ్యాడు (చూడు నిర్గమకాండము 8:15, 32). ఈ ప్రతిస్పందనను దేవుడు ముందే తెలియపర్చాడు. చివరిసారిగా ఫరో తన హృదయాన్ని కఠినపర్చుకున్నప్పుడు, ఇశ్రాయేలీయులు సముద్రము వద్ద నిల్చున్నప్పుడు దేవుడు మోషేతో ఈలాగు అన్నాడు,

> ఇదిగో నేను నేనే ఐగుప్తీయుల హృదయములను కఠినపరుచుదును, వారు వీరిని తరుముదురు; నేను ఫరోవలనను అతని సమస్త సేనవలనను అతని రథములవలనను అతని గుఱ్ఱపు రౌతుల వలనను నాకు మహిమ తెచ్చుకొందును. నేను ఫరోవలనను అతని రథములవలనను అతని గుఱ్ఱపు రౌతుల వలనను మహిమ తెచ్చుకొనునప్పుడు నేను యెహోవానని ఐగుప్తీయులు తెలెసికొందురు (నిర్గమకాండము 14:17, 18).

దేవుని తీర్పు శక్తిని చూచుట ద్వారా ఐగుప్తీయులు దేవుని గురించిన ప్రాముఖ్య పాఠమును నేర్చుకున్నారు. ఇశ్రాయేలీయులు అదే తప్పుచేసి శిక్షనొందుట ద్వార పాఠం నేర్చుకోవాలని దేవుడు ఆశించుటలేదు. అందుకని ఆయన తన పరిశుద్ధతను గురించిన సూచనను ముందస్తు హెచ్చరికను ఇచ్చాడు. క్రొత్త నిబంధన లేఖనముల ద్వారా సంఘమునకు ఆయన అదే హెచ్చరికను ఇస్తున్నాడు. దేవుని పరిశుద్ధతను గౌరవించి, పాపమును తొలగించుకుని మన జీవితముల ద్వారా పరిశుద్ధతను చూపించవలెనని క్రైస్తవులు సూచించబడ్డారు (ఉదాహరణకు చూడు 2 కొరింథీయులకు 7:1; హెబ్రీయులకు 10:26–31; 12:25–29; 1 పేతురు 1:15).

**తన ప్రజలను పిలుచుకుని బలపరచే దేవుడు**

దేవుడు మోషేను ఇశ్రాయేలు యొక్క విమోచకునిగా పిలుచుకున్నప్పుడు ఆయన అతనికి ఒక పనిని మాత్రమే అప్పగింపలేదు గాని ఆ పనిని చేయగల సామర్థ్యమును ఇచ్చాడు. అతడు ప్రజల యొద్దకు వెళ్ళినప్పుడు, వారు అతనిని నమ్మరని మోషే అభ్యంతరం తెల్పినప్పుడు దేవుడు కొన్ని సూచనలను ఇచ్చాడు. కర్రను పాముగా మార్చడం, తన వేలిని కుష్టరోగము గన్నట్టుగా చేయడం, తిరిగి బాగుచేయడం, నీళ్ళను రక్తముగా చేయడం వంటివి ఆ సూచనలలో భాగములు (4:1–9). దేవుని పక్షముగా మాట్లాడుటకు తను మాటచాతుర్యము గలవాడను కానని మోషే వేడుకొనగా, మానవులకు నోరు ఇచ్చినది తానేనని, ఎవరి సామర్థ్యమునకు తగినట్లు వారిని నిర్మించిన వానిని తానేనని దేవుడు ధైర్యపరిచాడు. అంతేగాకుండా, మోషే అన్నయైన అహరోనును అతనికి "నోటిగా" ఉండునట్లు నియమించాడు (4:10–17).

తరువాత, ఇశ్రాయేలీయులు సముద్రము ఎదుట నిలిచిపోయినప్పుడు, శక్తిగల ఐగుప్తు సేనలను తప్పించుకొను మార్గము లేకయున్నప్పుడు దేవుడు ఒక అద్భుత మార్గమును తెరిచాడు. ఆ పెద్ద జనాంగము నలభైయేళ్ళపాటు అరణ్యములో తిరుగుటకు ఆయన సహాయం చేశాడు.

దేవుడు ఈనాటికి ప్రజలను పిలుస్తూ బలపరుస్తున్నాడు. యేసును గురించి ప్రపంచమంతటా తెలియచెప్పడానికి దేవుని ప్రేమను, కృపను జనులతో పంచుకోవడానికి పరిశుద్ధ జనాంగముగానుండుటకు ఆయన క్రీస్తు ద్వారా సంఘమును పిలుస్తున్నాడీ రోజు. ఈ పని కొన్నిసార్లు కష్టముగా అన్పిస్తుంది. కానీ, ఈ పనిని చేయడానికి మనకేది అవసరమో అది ఆయన అనుగ్రహిస్తాడు. అందుకనే పరిశుద్ధాత్మని కుమ్మరింపుతో సంఘం ఆరంభమయింది. దేవుడు శక్తిని అనుగ్రహించునంతకాలం అపొస్తలులు కూడా నిస్సహాయులైయున్నారు. ఆత్మ కుమ్మరింపు తరువాత ప్రతీది మారిపోయింది. తన పని కోసం బలపరచడానికి, క్రీస్తునందు బాప్తిస్మం పొందిన ప్రతి విశ్వాసిలోను అదే పరిశుద్ధాత్ముడు నివసిస్తున్నాడు (అపొస్తలుల కార్యములు 2:1–38). దేవుని సేవను చేయకుండా నుండుటకు మనం ఎన్నడూ ప్రయత్నించకూడదు. దేవుడు మనల్ను దేని నిమిత్తం పిలుచుకున్నాడో దానిని చేయుటకు ఆయన మనల్ను బలపరుస్తున్నాడు.

### ముగింపు

తమను బానిసత్వమునుండి విడిపించి, దేవుని అద్భుత స్వేచ్ఛా స్వాతంత్ర్యమును అనుభవించుటకు పిలిచిన దేవునియందు నమ్మికయుంచుటకు మోషే మరియు ఇశ్రాయేలీయులు సవాలు చేయబడ్డారు. ఆయన తన మాటను నిలబెట్టుకునే దేవుడు, దేవతలందరికంటే ఉన్నతమైన దేవుడు, పరిశుద్ధుడు, తన పని నిమిత్తం తన ప్రజలను పిలుచుకునే దేవుడాయన. దేవుడు ఈనాటికీ మార్పులేకుండా ఎలా ఉన్నాడో, ఆయనను నమ్మి ఆయనయందు విధేయులైయుండుటకు గల సవాలు కూడా ఈనాటికీ ఉంది.

---

సూచనలు

[1]Paul R. House, *Old Testament Theology* (Downer's Grove, Ill.: InterVarsity Press, 1998), 92. [2]"యెహోవా" అనే పేరు "YHWH" అనే పదముతో "ప్రభువు" (*'Adonay*) అనే పదములోని అచ్చుల స్వరములను కలిసి జెర్మనివారిచే నిర్మించబడినది.

---

## ఫరో హృదయ కఠినము

నిర్గమకాండములో దేవుడు "ఫరో హృదయమును కఠిన పరచిన" విషయము, అలాగే ఆ విషయమును ఆయన ముందుగానే ప్రత్యేకంగా తెలియజేయడం గురించి వాక్య పాఠకులు గందరగోళపడుతుంటారు. దేవుడు ముందుగానే నిర్ణయించిన ప్రకారము ఫరో దేవున్ని తిరస్కరించాడని తద్వారా దేవుడు అతని మీద తనకున్న శక్తిని చూపించగలిగాడని సామాన్య చదువరి భావిస్తాడు. (చూడు నిర్గమకాండము 4:21.) దేవున్ని ఎవరూ ఎదిరించలేరు, అయితే, ఫరోకున్న అవకాశం ఏమిటి? దీన్నిబట్టి దేవుడే అతడు అవిధేయత చూపించేలా చేసి, తరువాత అతన్ని శిక్షించినట్లు అన్పిస్తుంది (ఫరో కాఠిన్యముతో దేవుని పాత్ర గురించి నిర్గమకాండము 9:12; 10:20, 27; 11:10ను చూడండి "ఫరో హృదయము కఠినపరచబడెను" అని మరికొన్ని వాక్యభాగములు తెలిజేస్తున్నాయి. దీనిలో ఎవరు కారకులో చెప్పడం లేదు [7:13, 22; 8:19; చూడు 9:7].)

ఫరో తన హృదయమును కఠినపరచుకున్నాడని కూడ వాక్యం చెప్తుంది. మరో మాటలో

చెప్పాలంటే, అతడు ఈ క్రమములో నిమిత్త మాత్రుడేమికాదు (నిర్గమకాండము 8:15, 32; 9:34; 14:5). ముందునుంచి కూడ ఈ బాధలన్ని చూచి దేవుని పట్ల మెడవంచని, మొండి వైఖరిని ఫరో కనబరుస్తూ వచ్చాడు. తను వ్యవహరిస్తున్న వ్యక్తి ఎలా ఉంటాడో దేవునికి బాగా తెలుసు. ఫరో హృదయం కాఠిన్యము ద్వారా పరిశుద్ధత గురించి ఐగుప్తీయులకే గాక, ఇశ్రాయేలీయులకూ ఆయన ఒక పాఠమును నేర్పించాడు.

> దేవుడు "కఠినపరచడం" అనేది గొఱ్ఱెలను గాడిదలుగా మార్చడం వంటిది కాదని చెప్పవచ్చు. దేవుని సూచనతోనే గాడిదలు తన్నుతాయని చెప్పవచ్చు. దాని ఫలితంగా, పైన సూచనతోనే అవి తన్నుతాయని తమ స్వచిత్తముతోనే తన్నుతాయి అలాగే సూచన చేసిన వాని జ్ఞానముతోనే తన్నుతాయి. రెండింటికి సమ ప్రాధాన్యం ఇయ్యబడింది. అలాగే ఫరో తన హృదయ కఠినమునకు అంతే సమముగా బాధ్యుడు (నిర్గమకాండము 9:34).[1]

---

సూచన

[1]Stephen Westerholm, *Preface to the Study of Paul* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1997), 105, n. 13.